క్లుప్తంగా

ముగిసిన తంటికొండ వెంకన్న కల్యాణోత్సవాలు



శ్రీపుష్పయాగం నిర్వహిస్తున్న పండితులు

గోకవరం: మండలంలోని తంటికొండ గ్రామంలో ప్రసిద్ధిగాంచిన వెంకటగిరి కొండపై వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు ఘనంగా ముగిశాయి. కల్యాణోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం రాత్రి ఈఓ ఆర్‌వీ చందన ఆధ్వర్యంలో స్వామివారికి ఊయల సేవ, శ్రీపుష్పయాగం నిర్వహించారు. జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్ దంపతులు స్వామివారిని దర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఈఓ చందన మాట్లాడుతూ ఈ ఏడాది భక్తుల సహకారంతో స్వామివారి కల్యాణోత్సవాలను వైభవంగా నిర్వహించినట్టు తెలిపారు.

సత్తెమ్మతల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి



సత్తెమ్మతల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే

బిక్కవోలు: పందలపాకలోని సత్తెమ్మతల్లి జాతర సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత ఐదు రోజులుగా జరుగుతున్న ఈ జాతర మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర పంచాయరాజ్ విభాగ సెక్రటరీ పోతుల ప్రసాదరెడ్డి, జేఏసీ మండల కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు, ఎంపీటీసీ సభ్యులు గీతా సావిత్రి, గ్రామ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పాలచర్ల వీర వెంకట సత్యనారాయణ, అనపర్తి మార్కెట్ కమిటీ డైరెక్టర్ షేక్ ఫీర్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

గోకవరం: కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని రాజుపాలెం రామాలయంలో ఆదివారం స్వామి, అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. సనాతన ధర్మ ప్రబోధన సమితి ఆధ్వర్యంలో దాతల సహకారంతో రాజుపాలెంలో రామాలయాన్ని పునర్నిర్మించారు. కొత్తపల్లికి చెందిన తోట పద్మనాభం, సంధ్యాదేవి దంపతులు పీఠలపై కూర్చొని సీతారామ, లక్ష్మణుల విగ్రహాల ప్రతిష్ఠించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు. స్థానిక పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తోట సాయి బాబు తదితరులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

అనపర్తి: స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం నుంచి జూన్ 11వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరాలు (సమ్మర్ క్యాంపు)నిర్వహిస్తున్నట్టు లైబ్రేరియన్ జి.అభిలాష్ తెలిపారు. 35 రోజుల పాటు గ్రంథాలయంలో నిర్వహించే సమ్మర్ క్యాంపులో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకూ పుస్తక పఠనం, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, మ్యూజిక్, డాన్స్, బొమ్మలు తయారీ, కథలు తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని తెలిపారు.

వేధింపులపై కేసు

సీతానగరం: గోపాలపురం మండలం పెద్దాపురానికి చెందిన కాస్సే కృష్ణతో మండలంలోని వెదుళ్లపల్లికి చెందిన కుసుమే విజయశాంతికి 2020 జూలైలో వివాహమైంది. అయితే ఉద్యోగం చేసి కుటుంబాన్ని పోషించాలంటూ విజయశాంతిని భర్త కృష్ణ, అత్త సరోజిని, ఆడపడుచులు విజయలక్ష్మి, తిరుపతమ్మ మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెడ్‌కానిస్టేబుల్ బి.లక్ష్మణరావు ఆదివారం తెలిపారు.

ముత్యాలమ్మకు పూజలు

రాజానగరం: గ్రామ దేవత ముత్యాలమ్మ జాతర, తీర్థ మహోత్సవాలు రెండు రోజుల పాటు వైభవంగా జరిగాయి. ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఆదివారం రాత్రి అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. అనంతరం ఆలయం ముంగిట జరుగుతున్న తీర్థం, సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించారు.

సంజీవయ్యకు నివాళి

ప్రకాశం నగర్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య వర్ధంతిని ఆదివారం గోకవరం బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎస్సీ నాయకులు పుష్పాంజలి ఘటించారు.

ఆందోళన వీడితే ఆరోగ్యం

- కాబోయే అమ్మల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి
- ఆసుపత్రుల్లో గర్భిణులకు అవగాహన



కొంకుదురులో పీహెచ్‌సీ వద్ద గర్భిణులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

బిక్కవోలు: ఒత్తిడి మనిషిని మానసికంగా క్రుంగదీస్తుంది. రోగాలబారిన పడేస్తుంది. ఇంటిని, బయట పనులను చక్కదిద్దే మహిళలు ఎక్కువ ఒత్తిడికి లోవుతుంటారు. దాని కారణంగా బీపీ రావడంతో పాటు గర్భధారణలో అనేక సమస్యలు తలెత్తుతాయి. నిద్రలేమి, ఆకలి లేకపోవడం, కొన్నిసార్లు గర్భస్రావం అయ్యే అవకాశాలు ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. ఇటువంటి సమస్యలను అధికమించేందుకు ప్రభుత్వం గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించింది.

మాతా శిశు మరణాలు పూర్తిగా అరికట్టేందుకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఎన్నో సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ప్రతి నెలా ప్రతి నెలా 9న మాతృత్వ వందన యోజన ద్వారా ప్రత్యేక చికిత్సలు నిర్వహిస్తూ తల్లీబిడ్డల సంక్షేమానికి కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా గర్భిణులు ఒత్తిడిని ఎలా అధిగమించాలో ఆస్పత్రుల్లోనే అవగాహన కల్పిస్తున్నారు. నియోజకవర్గంలోని రూ.2,316 మంది గర్భిణులు ఉన్నారు. వీరి కోసం ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వైఎస్సార్ సంపూర్ణపోషణ, సంపూర్ణ పోషణ ప్లస్, ఫోర్టిఫైడ్ బియ్యం, కోడిగుడ్లు, పాలు, బెల్లం, కర్జూరం, ఆయిల్, బ్యాళ్లు, రాగిపిండి, పాలు లాంటి పోషకాలు కలిగిన ఆహారం అందిస్తోంది.

గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

గర్భిణులు తొలి ఐదు నెలలు అత్యంత జాగ్రత్తలు పాటించాలి. ఎక్కువ బరువులు ఎత్తకూడదు. ఆందోళన పడకూడదు. ఒత్తిడి లేకుండా ఉండాలంటే నలుగురితో మాట్లాడుతూ ఉండాలి. తగినంత నిద్ర పోతూ ఉండాలి. ఎప్పుడు నవ్వుతూ ఉండాలి. సరైన ఆహారం తినాలి. వ్యాయామం చేయాలి.

అవగాహన కల్పిస్తున్నాం



గర్భిణులు ఒత్తిడిని ఎలా అధిగమించాలో ప్రభుత్వాస్పత్రుల్లో కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నాం. డాక్టర్లు పరీక్షలు నిర్వహించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో ఏఎన్‌ఎం ఆయాలు, అంగన్‌వాడీ సిబ్బంది గర్భిణుల ఆరోగ్యంపై ఆరా తీస్తుంటారు. ప్రతి నెలా 9న ఆస్పత్రిలో గర్భిణులకు మాతృత్వ వందన యోజన ద్వారా ఉచితంగా పరీక్షలు నిర్వహించి, కాన్పు జరిగే వరకూ పాటించాల్సిన నియమాలపై అవగాహన కల్పిస్తున్నాం.

–డాక్టర్ రాజీవ్,
పీహెచ్‌సీ వైద్యుడు, బిక్కవోలు

వృద్ధురాలికి వైద్యం



108 వాహనంలో వృద్ధురాలిని తరలిస్తున్న దృశ్యం

పెదపూడి: రామేశ్వరంలో ఓ వృద్ధురాలు అనారోగ్యంతో బాధపడుతుండగా అటుగా వస్తున్న పెదపూడి ఎస్సై పి.వాసు ఆమెను చూసి, వెంటనే కాకినాడ జీజీహెచ్‌కు తరలించి వైద్యం అందించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం రామేశ్వరం గ్రామంలో లక్ష్మి అనే వృద్ధురాలు అనారోగ్యంతో బాధపడుతుందన్నారు. ఆమెతో మాట్లాడగా చాలా నీరసంగా ఉందని, వెంటనే 108 వాహనానికి కాల్ చేసి కాకినాడ తరలించానన్నారు. ఆమెకు బంధువులు ఉన్నప్పటికి వదిలేశారని ఆమె చెప్పిందన్నారు. ఆమె ప్రస్తుతం కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. వైద్యం అనంతరం ఏదో ఒక ఆశ్రమంలో చేర్పనున్నట్టు ఆయన తెలిపారు.

ప్రభుత్వ ప్రోత్సాహంతో సత్ఫలితాలు



విద్యార్థిని అభినందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: విద్యా వ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందిస్తున్న ప్రోత్సాహం సత్ఫలితాలను ఇస్తున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన పదో తరగతి ఫలితాల్లో నియోజకవర్గంలోని బిక్కవోలు మండలం పందలపాక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి మాడెం దినేష్ వీర గణేష్‌కుమార్ 589 మార్కులు సాధించాడు. ప్రభుత్వ పాఠశాలల్లో జిల్లా స్థాయిలో అత్యధిక మార్కులు సాధించాడు. ఈ సందర్భంగా గణేష్‌కుమార్‌తోపాటు పాఠశాల హెచ్‌ఎం సీహెచ్‌వీ సోమిరెడ్డి, పాఠశాల అధ్యాపకులను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి చేయడంతో పాటు అన్ని వసతులు కల్పించిందన్నారు. దీనిని అందిపుచ్చుకున్న విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నారని అన్నారు. నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి సత్తా చాటారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు హరిప్రసాదరెడ్డి, ఉపాధ్యాయుడు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో అన్నివర్గాల సంక్షేమం



ముగ్గళ్లలో వైఎస్సార్ సీపీలో వారితో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- వైఎస్సార్ సీపీలో 160 మంది చేరిక

సీతానగరం: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, వాటికి ఆకర్షితులై చాలామంది వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. రఘుదేవపురంలో టీడీపీకి చెందిన కాండ్రు వెంకటరాజుతో పాటుగా టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 60 మంది ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. అలాగే ముగ్గళ్లలో పినిపే సందీప్ కుమార్‌తో పాటు 100 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

98 శాతం హామీల అమలు

జక్కంపూడి రాజా మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఏర్పడిన మూడున్నరేళ్లలోనే మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 98 శాతం నెరవేర్చామన్నారు. కులమతాలకు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందజేస్తున్నామన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా జగన్ పాలన సాగుతోందన్నారు. పార్టీ అభ్యున్నతి కోసం కష్టపడే కార్యకర్తలకు వైఎస్సార్ సీపీలో తగిన ప్రాధాన్యత ఉంటుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం బూత్ కమిటీ చైర్మన్, పార్టీలో చేరికల కమిటీ కన్వీనర్ గద్దె వెంకటకృష్ణ చౌదరి (నల్లి), ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కోకన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాదే చంటిబాబు, మండల సర్పంచ్‌ల సమాఖ్య సంఘం అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, సుంకవల్లి సుబ్రహ్మణ్యం, రుద్రం వీరేంద్ర, గెద్దాడ త్రిమూర్తులు, పైడి రాజు పాల్గొన్నారు.

బైక్‌ల అదృశ్యం

బిక్కవోలు: బైక్‌ల అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై పి.బుజ్జిబాబు తెలిపారు. ఆదివారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 5వ తేదీన బిక్కవోలు మసీదు వద్ద ఉంచిన హెచ్‌ఎఫ్ డీలక్స్, గాయత్రీ భోజన హోటల్ వద్ద ఉంచిన గ్లామర్ బైక్‌లు అదృశ్యమయ్యాయని, ఆ బైకుల యజమానులు షేక్ మాబు సుభాని మున్నా, అబ్దుల్ అకబార్ బాషా ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై బుజ్జిబాబు తెలిపారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- కాటవరం, చినకొండేపూడిలో ఉపవిద్యుత్ కేంద్రాలకు శంకుస్థాపన



కాటవరంలో విద్యుత్ ఉపకేంద్ర శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: మండల ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరం అందించడమే లక్ష్యంగా అవసరమైన చోట్ల విద్యుత్ ఉప కేంద్రాల నిర్మాణం చేపడుతున్నామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. కాటవరంలో రూ.2.75 కోట్లు, చినకొండేపూడిలో రూ. 2.66 కోట్లతో నిర్మించే విద్యుత్ ఉప కేంద్రాలకు ఆదివారం ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాటవరం విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని కాటవరం, మునికూడలి, రాజంపేట, వెదుళ్లపల్లి, చినకొండేపూడి విద్యుత్ ఉప కేంద్రం పరిధిలోని రఘుదేవపురం, సీతానగరం, చినకొండేపూడి, రాపాక, చీపురపల్లి, అచ్చయ్యపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి అవరోధాలు ఏర్పడవన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

వెదుళ్లపల్లి పంచాయతీ పరిధిలోని రాజంపేటలో అక్కిన ఫౌండేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రారంభించారు. అక్కిన ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం ఎంతో హర్షణీయమన్నారు. ప్లాంట్‌కు స్థలం అందించిన కవల సత్తిరాజు కుమారులు కవల కృష్ణమూర్తి, కవల సురేష్‌ను అభినందించారు.

మన్యం వీరుడికి నివాళి

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకుని చినకొండేపూడిలోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

పురుషోత్తపట్న పంచాయతీ రామచంద్రపురంలో 22 మంది మహిళలకు ఇళ్ల స్థలాల పట్టాలను, అలాగే చెరుకూరి వెంకటలక్ష్మికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి విడుదలైన రూ.50 వేల చెక్కును ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చేతుల మీదుగా అందజేశారు. వంగలపూడిలో తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్ సహకారం రూ.10 లక్షలతో పాటు దాతల సహకారంతో రామాలయం పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రఘుదేవపురంలో పేరంటాలమ్మ సంబరం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నసమారాధనలో పాల్గొన్నారు.

బాధిత రైతులతో సమావేశం

పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం బాధిత రైతులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ బాధిత రైతులకు న్యాయస్థానం ద్వారా ఎక్కువ పరిహారం అందేలా ఉంటే వారికి కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అలాగే ఎకరానికి రూ.28 లక్షలు పరిహారం అందుకోవడానికి రైతులు అంగీకరిస్తే.. ప్రభుత్వం పరిహారం అందించడానికి సుముఖంగా ఉందన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్‌ఈ టీవీఎస్‌ఎన్ మూర్తి, ఏడీఈ చిట్టిరాజు, ఏఈ చంద్రమోహన్‌రావు, ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరి బాబు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, గద్దె వీరన్నబాబు, సత్తిపండురాజు, ముదునూరి ప్రసాదరాజు, పోలినాటి రామచంద్రరావు పాల్గొన్నారు.

ఆదిత్యునికి పంచామృతాభిషేకాలు

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో ఉన్న సూర్యనారాయణమూర్తి స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆదివారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని వ్రతాలు చేయించుకున్నారు.

పదిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి అభినందన

రంగంపేట: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో చంద్రేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని నాయుడు వీర హాసిని 541 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా ఆదివారం గ్రామ సర్పంచ్ జాస్తి వెంకట పద్మావతి, వైఎస్సార్ సీపీ నాయకుడు జాస్తి సత్తిబాబు దంపతులు హాసినిని అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత విద్యను అభ్యసించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని తల్లిదండ్రులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ



శివాలయంలో ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: స్థానిక పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం (శివాలయం) ధ్వజస్తంభం పునః ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి ఆలయంలోని యాగశాలలో సొసైటీ అధ్యక్షుడు గాజింగం సత్తిబాబు, వల్లీదేవి దంపతులు పీఠలపై కూర్చొని ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అలాగే ప్రతిష్ఠకు ముందు ధ్వజస్తంభానికి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. ఉదయం 11 గంటలకు ఆలయ పండితులు ప్రత్యేక పూజలు చేసి ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తాం



చినకొండేపూడిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తామని, రైతులు అధైర్య పడవద్దని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. చినకొండేపూడిలో ధాన్యం కళ్లాలను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ఎట్టి పరిస్థితిల్లోనూ వదిలేది లేదని, వర్షాలకు మొలకెత్తిన ధాన్యం ఉన్నా కొనుగోలు చేస్తామన్నారు. దళారులు, వ్యాపారుల చేతుల్లో రైతులు మోసపోకుండా ఉండేందుకు ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు జరుపుతోందన్నారు. ఆయన వెంట ఏడీఏ బీకే మల్లికార్జునరావు, ఏఏఏ కోలా అచ్యుత్, వైస్ ఎంపీపీ–1 ముదునూరి సురేష్‌రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు సత్తిపండురాజు, ముదునూరి రామకృష్ణంరాజు, కోసూరి నాగరాజు, మణిరాజు రైతులు సంబూరి త్రిమూర్తులరాజు, చిక్కిరెడ్డి ప్రభు, పందుళ్ల ఆదినారాయణ, కోనే ఇంద్ర తదితరులు ఉన్నారు.

వేసవి శిక్షణ... భవితకు రక్షణ

- నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు
- విద్యార్థులకు పలు అంశాలపై ప్రత్యేక శిక్షణ
- బయట పడనున్న సృజనాత్మకత



గోకవరం గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంపై ప్రచారం చేస్తున్న అధికారులు

గోకవరం: గ్రంథాలయాలు జ్ఞాన సముపార్జనకు నిలయాలు. పుస్తక పఠనంతో జ్ఞానాన్ని ఆర్జించవచ్చు. ఒకప్పుడు గ్రంథాలయాలకు పాఠకుల తాడికి ఎక్కువగా ఉండేది. ఉదయం, సాయంత్రం విధిగా గ్రంథాలయాలకు వెళ్లి పుస్తక పఠనం చేసేవారు. రానురాను ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది. ప్రస్తుతం సెల్‌ఫోన్లకు బానిసలు కావడం, సోషల్ మీడియా నేపథ్యంలో పుస్తక పఠనం పట్ల పెద్దలకు, చిన్నారులకు సైతం ఆశక్తి తగ్గింది. దీనివలన గ్రంథాలయాలకు వచ్చే పాఠకుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయాల ద్వారా పుస్తక పఠనంపై ఆశక్తి పెంచేందుకు ఏటా పలు కార్యక్రమాలను నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా ఈ ఏడాది వేసవి విజ్ఞాన శిబిరాలను ఈ నెల 8వ తేదీ నుంచి జూన్ 11 వరకు నిర్వహిస్తుంది.

పలు అంశాలపై శిక్షణ

గ్రంథాలయాల్లో ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తారు. విద్యార్థులతో కథలు చెప్పించడం, చదివించడం, స్పోకెన్ ఇంగ్లిష్, బొమ్మల తయారీ, తెలుగు పద్యాలు చదివించడం వంటి పలు అంశాలపై శిక్షణ ఇస్తారు. ఇందు కోసం ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులు ముందుకు రావాలని గ్రంథాలయ శాఖ కోరింది.

నియోజకవర్గంలో..

జగ్గంపేట నియోజకవర్గంలోని గోకవరం, మల్లవరం జగ్గంపేట, కిర్లంపూడి, గెద్దనాపల్లి, వీరవరం, గండేపల్లి, మురారి గ్రామాల్లో శాఖా గ్రంథాలయాలు ఉన్నాయి. ఈ గ్రంథాలయాల్లో సోమవారం నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా వారిలో సృజనాత్మక శక్తి పెరిగి తద్వారా చదువులో బాగా రాణించే అవకాశం ఉంది. అలాగే ఆయా గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు, మెటీరియల్ కూడా అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాల అధికారులు కోరుతున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



గ్రంథాలయాల్లో సుమారు నెల రోజుల పాటు వేసవి విజ్ఞాన శిబిరాలు జరుగుతాయి. విద్యార్థులు ఈ శిబిరాలకు హాజరు కావడం ద్వారా చదవడం, కథలు చెప్పడం వంటివి నేర్చుకుంటారు. వీటి ద్వారా వారిలో అంతర్గతంగా దాగి ఉన్న సృజనాత్మక శక్తి బయటకు వస్తుంది. విద్యార్థులు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి.

– కె.ప్రియదర్శిని, గ్రంథాలయాధికారి, గోకవరం

అల్లూరి స్ఫూర్తితో పోరాటం చేద్దాం



సీతారామరాజు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

మధురపూడి: అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వెంకట నాయుడు అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన కోరుకొండలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయుడు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆదివాసీల హక్కులను కాలరాస్తోందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జనుపల్లి సత్తిబాబు, నాయకులు సూరిబాబు, సూర్యనారాయణ, నాగన్న పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

రాజానగరం: అకాల వర్షాలకు తడిచిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకే కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందని, రైతులెవ్వరూ ఆందోళన చెందవద్దని వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు అడబాల చినబాబు అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా అన్నదాతలకు ఈ విధంగా అండగా నిలిచింది లేదన్నారు. తడిచిన, రంగు మారిన సరే రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని మద్దతు ధరకే కొనాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారన్నారు. అందుబాటులో ఉన్న రైతు భరోసా కేంద్రాల ద్వారానే ఈ కొనుగోళ్లు జరుగుతాయన్నారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి



మృతి చెందిన వృద్ధురాలు

రాజానగరం: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 60 ఏళ్ల గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందిందని స్థానిక ఎస్సై జుబేర్ తెలిపారు. మండలంలోని పాతతుంగపాడులో ఈనెల 27న రోడ్డు పక్కన సొమ్మసిల్లి పడిపోయిన ఆమెను స్థానికుల సాయంతో రాజమహేంద్రవరంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఆచూకీ తెలిసిన వారు తమను సంప్రదించాలని సీఐ కాశీవిశ్వనాథ్ విజ్ఞప్తి చేశారు.